క్లుప్తంగా

థ్యాంక్యూ జగనన్నా..



పాలాభిషేకం చేస్తున్న దళిత నాయకులు

శ్రీకాకుళం: దళితవాడలను ప్రత్యేక పంచాయతీలు చేస్తామని హామీనివ్వడంతో హర్షం వ్యక్తం చేస్తున్నామని ఏఐఎం రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను అన్నారు. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలిలో ఏఐఎం ఆధ్వర్యంలో థ్యాంక్యూ జగనన్నా..థ్యాంక్యూ సునీల్ అన్నా అంటూ అంబేడ్కర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పి.వి.సునీల్‌కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు ప్రత్యేక పంచాయతీలు కావాలని గతంలో సునీల్‌కుమార్ పోరాటం చేశారని, అంబేడ్కర్ ఆశయం నెరవేరబోతోందని చెప్పారు. కార్యక్రమంలో దళిత యువత పాల్గొన్నారు.

ఓటర్లను గుర్తించడమే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఓటరు జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండి గ్రామాల్లో ప్రతి ఓటరును బూత్ ఏజెంట్లు గుర్తించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటీ ఫంక్షన్ హాలులో ఎచ్చెర్ల నియోజకవర్గవ్యాప్తంగా నాలుగు మండలాల బూత్ ఏజెంట్లు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు సైనికుల్లా పని చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమై సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న మంచిని వివరించాలని సూచించారు. ప్రజలను ఆత్మీయంగా పలకరించి జగనన్న ఐదేళ్ల పాలనలో అందిన సంక్షేమ పథకాలు వివరించాలన్నారు.ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జగనన్నతోనే రెల్లి కులస్తుల అభివృద్ధి



సీతారాంపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఫాణికుమార్

రణస్థలం: రాష్ట్రంలోని రెల్లి కులస్తులను గుర్తించి సముచిత స్థానం కల్పించడమే కాకుండా అభ్యున్నతికి పాటుపడిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని రెల్లి కుల యువజన సేవా సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జోనల్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు వడ్డాది ఫాణికుమార్ తెలిపారు. ఆదివారం సీతారాంపురంతో పాటు నాలుగు మండలాల్లోని రెల్లి కుటుంబ సభ్యులను కలిపి వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుప్పిలి గోపి, పిన్నింటి ఇసాకు, వెంకటరమణ, కుప్పిలి వెంకటరమణ, బంగారు రామారావు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం



పెంట గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.సిగడాం: మండలంలోని డి.ఆర్.వలస, ముషినివలస, బాతువ, చంద్రయ్యపేట, దేవరవలస, జాడ, మర్రివలస, పెంట, నాగులవలస గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. పెంట గ్రామంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, సర్పంచ్‌లు పున్నాన సోనియా, పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ ఎం.శ్రీనివాసరావులు ఇంటింటికి వెళ్లి జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, సత్యనారాయణ, నాయకులు పాండుబాబు, పున్నాన పాపినాయుడు, రాము పాల్గొన్నారు.

40 మద్యం బాటిళ్ల పట్టివేత

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ రవి ప్రసాద్ పట్టుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పైడిభీమవరం ప్రాంతంలో ఎస్‌ఈబీ పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం పట్టుకోవడంతోపాటు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

పక్కాగా.. పౌష్టికాహారం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో విజయవంతంగా టేక్ హోం రేషన్ అమలు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా రేషన్ సరుకులు
- రక్తహీనత నివారణకు దోహదం



అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం తీసుకుంటున్న చిన్నారులు



లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ కిట్లు పంపిణీ

అభివృద్ధి పథం సంక్షేమ రథం

ఇచ్ఛాపురం రూరల్:

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలు ఇస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో టేక్ హోం రేషన్ పేరిట పకడ్బందీగా లబ్ధిదారులకు సరుకుల పంపిణీ జరుగుతోంది. గర్భిణులకు గతంలో ఇచ్చే పప్పు, పాలు, గుడ్లకు అదనంగా మరో ఆరు రకాల పోషకాహార సరుకులను అందించడంతో వారిలో రక్తహీనత తగ్గి ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తున్నారు.

పోషణ, పోషణ ప్లస్ కిట్లు..

మైదాన ప్రాంత గర్భిణులకు రెండు కేజీలు రాగి పిండి, 250 గ్రాముల వేరుశనగ చిక్కీ, 250 గ్రాముల ఎండు కర్జూరం, కేజీ అటుకుల్లు వీటన్నింటిని డ్రై రేషన్‌గా లబ్ధిదారులకు 'టేక్ హోం రేషన్' విధానంలో అందజేస్తున్నారు. గిరిజన ప్రాంత లబ్ధిదారులకు అదనపు పోషణ నిమిత్తం వైఎస్సార్ సంపూర్ణ ప్లస్ కిట్లు అందజేస్తున్నారు. చిరుధాన్యాల మిశ్రమ గోధుమపిండి 2 కేజీలు, వేరుశెనగ పలుకుల చిక్కీ 500 గ్రాములు, రాగి పిండి కేజీ, బెల్లం 500 గ్రాములు, 500 గ్రాములు ఎండు ఖర్జూరం వంటి పోషకాహారం సరుకులను ప్లస్ కిట్ రూపంలో అందిస్తున్నారు. వీటితో పాటు పాలు(5లీటర్లు), 25 కోడిగుడ్లు అందిస్తున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు పోషణ, పోషణ ప్లస్‌లకు అదనపు పోషకాహారంగా టీహెచ్‌ఆర్ రూపంలో నెలకోసారి బాలామృతం ప్యాకెట్(2.5 కేజీలు), 2.5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లు అందిస్తున్నారు. ట్రైబల్ సబ్ ప్లాన్ ఏరియా పిల్లలకు పోషణ ప్లస్ కింద టీహెచ్‌ఆర్ రూపంలో నెలకోసారి బాలామృతం ప్యాకెట్ (2.5 కేజీలు), 6 లీటర్ల పాలు, నెలకు 30 గుడ్లు అందిస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం సంపూర్ణ భోజనం, 100 మిల్లీ లీటర్ల పాలు, రోజూ కోడిగుడ్డు అందజేస్తున్నారు.



లబ్ధిదారులకు బాలామృతం పంపిణీ

నాణ్యమైన సరుకులు..



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా ఎండు ఖర్జూరం, రాగి పిండి, అటుకుల్లు, పాలు, పప్పు, గుడ్లు అందజేస్తున్నారు. సకాలంలో వైద్య సలహాలు ఇస్తున్నారు.

– బొనికల శ్రావణి, గర్భిణి, టి.బరంపురం, ఇచ్ఛాపురం మండలం

సక్రమంగా సరఫరా..



గర్భిణిగా ఉన్నప్పటి నుంచి బాలింత అయిన వరకు పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలను సక్రమంగా అందజేస్తున్నారు. ప్రతి నెలా అంగన్‌వాడీ కార్యకర్త మా ఇంటికి వచ్చి ఆరోగ్యం గురించి వాకబు చేస్తుంటారు.

– నిమ్మాని రోజ, బాలింత, భవానీపురం, ఇచ్ఛాపురం మండలం

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు	మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	6 నుంచి 3 ఏళ్ల చిన్నారులు	ప్రీ స్కూల్ చిన్నారులు
16	3358	2759	599	12771	12732	60,000	34,000

చెప్పారంటే... చేస్తారంతే

మంచి నిర్ణయం



ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే నాలాంటి చాలా మందికి సొంతిళ్లు కట్టుకునే భాగ్యం కలిగింది. సెంటున్నర స్థలంతో పాటు ఇళ్లు కట్టుకునేందుకు సాయం అందుతోంది. ఈ పథకం కొనసాగించడం మంచి నిర్ణయం

– బలివాడ ఉపేంద్ర, రామచంద్రాపురం, గార మండలం

అమ్మఒడితో ఊరట



తల్లిదండ్రులకు పిల్లల చదువులు భారం కాకూడదని పెట్టిన అమ్మఒడి పథకం ఎంతోమందికి ఊరటనిస్తుంది. మరో ఐదేళ్లపాటు రెండు వేల రూపాయలు పెంచుతూ పథకం కొనసాగించడం బాగుంది.

– బత్తుల గోవిందరావు, కె.మత్స్యలేశం, గార మండలం

దళితులకు లబ్ధి



మేనిఫెస్టోను గ్రంథంగా భావించే నాయకుడు సీఎం జగన్. గిరిజనుల మాదిరిగానే 500 మించి జనాభా ఉన్న ఎస్సీ ప్రాంతాలను కూడా పంచాయతీలుగా పరిగణించాలనే నిర్ణయం బాగుంది.

– ముంజేటి కృష్ణమూర్తి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి

తప్పక అమలుచేస్తారు



సీఎం జగన్‌మోహన్ రెడ్డి 2019 నవరత్నాలు మేనిఫెస్టోలో చెప్పినట్లు అన్నీ హామీలు అమలు చేశారు. తాజాగా నవరత్నాలు మ్యానిఫెస్టో–ప్లస్ ప్రకటించి అన్నీ హామీలు అమలు చేస్తారనే నమ్మకముంది.

– పిన్నింటి రజినీ, రణస్థలం ఎంపీపీ

మళ్లీ జగన్‌కే అధికారమిద్దాం



తంగివానిపేటలో ప్రచారంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: చంద్రబాబు మాయమాటలు నమ్మి ఆయనకు ఓటు వేస్తే మన భవిష్యత్ అంధకారంలోకి వెళ్తోందని, రాష్ట్రం రావణకాష్టంగా మారుతోందని, చంద్రబాబు మాయమాటలను ఎవ్వరూ నమ్మవద్దని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రూరల్ మండల పరిధిలోని తంగివానిపేటలో ఆదివారం ఎన్నికల ప్రచారంలో ధర్మాన మాట్లాడారు. టీడీపీవి అన్నీ అబద్ధపు హామీలేనని, ఒక్కటి కూడా నెరవేర్చరని, ప్రజలను మభ్యపెట్టేందుకు మేనిఫెస్టో తయారు చేశారని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంతో జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చామని తెలిపారు. వేల కోట్ల రూపాయలతో పోర్టు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ఉద్దానం పరిసర ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఉపరితల జలాలు అందించేందుకు సంబంధిత ప్రాజెక్టును పూర్తిచేశామన్నారు. వంశధార నీరు శివారు గ్రామాలకు అందించడమే కాకుండా పలాసలో కిడ్నీ రిసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఎటువంటి కేసు వచ్చినా రిఫర్ టు వైజాగ్ అనకుండానే అన్ని వసతులతో కూడిన సదుపాయాలు శ్రీకాకుళం రిమ్స్‌లోనే అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.75వేలు అందించామన్నారు. పింఛన్ పథకాన్ని రూ.3000 నుంచి రూ.3,500 చేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇవ్వడం ద్వారా అవ్వాతాతల కళ్లల్లో సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రచారానికి హాజరైన జనసందోహం

సంక్షేమాభివృద్ధే జగనన్న లక్ష్యం

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధి రెండు కళ్లులా భావిస్తూ పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ సతీమణి మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ, రణస్థలం ఎంపీపీ పిన్నింటి రజిని తెలిపారు. వెల్పురాయి పంచాయతీలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కిరణ్‌కుమార్‌ను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కుమారుడు బెల్లాన వంశీకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గురాన మానస, వెల్పురాయి మాజీ ఎంపీటీసీ కెల్ల రామకృష్ణ, ఎంపీటీసీ ప్రతినిధి గురాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కిరణ్ సతీమణి మాజీ ఎంపీపీ గొర్లె పరిమళ కోరారు. గోవిందపురం, బరణకాం, ఇజ్జాడపాలెం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, వైస్ ఎంపీపీలు, లుకలాపు శ్రీను, అలుపన రమణమ్మ, బొంతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెల్పురాయిలో వృద్ధుడికి ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న గొర్లె పరిమళ, పిన్నింటి రజిని

సైన్స్‌ఫెయిర్ విజేతలకు బహుమతులు

శ్రీకాకుళం అర్బన్: మేధస్సుకు నిరంతరం పదును పెట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధ్యపడతాయని విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు తెలిపారు. నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ఫిబ్రవరిలో నిర్వహించిన మెగా సైన్స్ ఫెయిర్ విజేతలకు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆదివారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే శాస్త్రీయ దృక్పథం కలిగి మంచి ప్రాజెక్టులతో సైన్సు ఫెయిర్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం 560 మందికి జ్ఞాపికలు, 120 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఏ.లావణ్యరాణి, ప్రిన్సిపల్ బి.కిరణ్‌కుమార్, సైన్స్ ఫెయిర్ ఇన్‌చార్జి సౌజన్య, కో–ఆర్డినేటర్లు దేవి, దీప కుమారి, విజయ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో విజిలెన్స్ ఎస్పీ సురేష్ బాబు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రతినిధులు

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చేపల వీధి కూడలి వద్ద అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన వాటిక వ్యవస్థాపకులు భాస్కరభట్ల శ్రీరామశర్మ ఆధ్వర్యంలో సీతారామ చంద్రమూర్తులను వేదికపై ఉంచి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామ పారాయణ పూర్వక కుంకుమ పూజలు, పట్టాభిషేక ఘట్ట పారాయణ నిర్వహించారు. అనంతరం పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంగీత విభావరి ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న చక్రతీర్థ స్నానాలు



ఉత్సవమూర్తులకు అవభృథ స్నానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక తిరుక్కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం చక్రతీర్థస్నానం ఘనంగా నిర్వహించారు. శ్రీకూర్మం దేవస్థానం అర్చకుడు గోపినంబాళ్ల నల్లకూర్మాన్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు బూరాడ వంశీకృష్ణ అర్చకత్వంలో స్వామివారి ఉత్సమూర్తులకు నాగావళి నది నీటితో అవభృత స్నానాలు, వసంతోత్సవం చేశారు. ధ్వజావరోహణం, వేదస్వస్తి నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో ప్రతి హామీ అమలు చేస్తాం



అంపోలులో ఇంటింటా ప్రచారంలో ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



నైరా గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ధర్మాన గజలక్ష్మి

గార: ఎన్నికలకు ముందు చెప్పిన ప్రతిమాట తప్పకుండా చేస్తామని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. ఆదివారం అంపోలు పంచాయతీ మంగళవారంపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జరిగిన మంచిని గుర్తించాలన్నారు. ప్రతి ఇంటికి లబ్ధిదారుల అర్హత ఆధారంగా పైసా అవినీతి లేకుండా పథకాలు వర్తింపజేశామన్నారు. ఈ ప్రాంతానికి వంశధార నీరు వచ్చింది మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి వల్లేనని గుర్తు చేశారు. ఫ్యాను గుర్తుపై ఓటువేసి ఎంపీగా పేరాడ తిలక్‌ను, ఎమ్మెల్యేగా ధర్మాన ప్రసాదరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, సర్పంచ్ గొండు జయరాంలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా గ్రామంలో ఆదివారం మంత్రి ధర్మాన ప్రసాదరావు భార్య ధర్మాన గజలక్ష్మీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆమెతో పాటు గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!



సీతారాముల కల్యాణ ఘట్టం ప్రదర్శిస్తున్న శార్వాణీ స్కూల్ చిన్నారులు



దేశభక్తి ప్రదర్శన ఇస్తున్న సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

వేసవి సెలవులు రావడంతో పాఠశాలల్లో వార్షికోత్సవ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. విద్యార్థులు ప్రదర్శిస్తున్న నృత్య రూపకాలు అబ్బురపరుస్తున్నాయి. స్టేజ్ కళాకారులకు దీటుగా అభినయిస్తూ ఆహూతులను అలరిస్తున్నారు. ఆదివారం అరసవల్లి రోడ్డులోని శార్వాణీ విద్యాలయం, కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద ఉన్న సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నాటిక ప్రదర్శనలు, డ్యాన్స్‌లతో సందడి చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం అర్బన్

సంక్షిప్తంగా..

చలివేంద్రాలతో ఉపశమనం



ఏడురోడ్ల కూడలి వద్ద చలివేంద్రం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలులో ఆదివారం మేముసైతం సేవా సంఘం సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వాహనదారులకు చల్లటి మజ్జిగ, మంచినీరు అందిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అప్పారావు, రామకృష్ణ, పి.వి.ఎస్.ఎస్.మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఆదివారం మెగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో వెయ్యి మజ్జిగ ప్యాకెట్లు, జీరా ప్యాకెట్లు, గ్లూకోజ్ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకుడు మిమిక్రీ శ్రీనివాస్ తెలిపారు. పద్మావతి నగర్‌లో నీలకంఠేశ్వరరావు దంపతులు, ఉమామోహన్ దంపతులు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకొని అల్లినగరం కూడలిలో హెచ్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు వారాలుగా చలివేంద్రం కొనసాగుతోంది. ఎండ తీవ్రత నేపథ్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు.

కాంప్లెక్స్‌లో ఉచిత మజ్జిగ

శ్రీకాకుళం అర్బన్: మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడమే భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ధ్యేయమని శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటో డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్ అన్నారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు శ్రీసత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సమాజసేవే పరమావధిగా శ్రీ సత్యసాయిబాబా సేవా సమితి సంస్థలు పనిచేస్తున్నాయని తెలిపారు. దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం మజ్జిగను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం ఎల్ఎస్ నాయుడు, ఎంపీ రావు, శ్రీసత్యసాయిబాబా సేవాసంస్థల ప్రతినిధులు, ప్రయాణికులు ఉన్నారు.

ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీకాకుళం కల్చరల్ : కవి తెనాలి రామకృష్ణ రచించిన పాండురంగ మహత్యంలో నిగమ శర్మ ఉపాఖ్యానంపై తెలుగు పండితుడు మంగిపూడి శ్రీనివాసరావు ప్రసంగించారు. ఆదివారం నగరంలోని ఉపనిషన్మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లతో పాపకార్యాలు చేసిన నిగమ శర్మ పాండురంగని దర్శనంతో విష్ణు సాన్నిధ్యం పొందాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు నిష్టల నర్సింహమూర్తి, బి.కోమలరావు, ఎం.కొండబాబు, విశ్వేశ్వరరావు, ఈశ్వరరావు, బలగ తౌడు, బాబూరావు, పి.వి.ఎస్ ప్రసాద్, సరస్వతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

శ్రీకాకుళం/శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఆర్‌కే ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వాకర్లు, క్రీడాకారులు, విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. స్టార్ వాకర్స్ క్లబ్ ఆహ్వానం మేరకు జరిగిన ఈ శిబిరంలో ఆస్పత్రి ఎండీ డాక్టర్ బాడాన రామకోటేశ్వరరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.